



**(క్రిందటి నెల నుంచి కొనసాగింపు)**

తెల్లవారింది. కాఫీ తాగుతూ వంశీ సంగతి ఇందిర దగ్గర మరల తెచ్చాడు.

"ఏం చేద్దాం ఇందిరా? వాడు చెప్పినట్టే మన తప్పలను సరిదిద్దుకుందామా?"

ఇందిర తిరగబడింది.

"ఏంటండీ మన తప్పలు? అన్నీ మనవేనా ? అక్కడకు మీ అమ్మనాన్నలు, మిగిలిన వాళ్ళూ ఏమీ ఎరగని నంగనాచిలా? అయినా గుడొచ్చి పిల్లను వెక్కింరించినట్లు వీడా మనకు బుద్ధులు చెప్పేది?"

ఇందిర తన సహజసిద్ధ ధోరణిలోనే మాట్లాడింది. రవికీ అలానే అనిపించింది, అయినా మౌనం దాల్చాడు.

"ఏమిటి మాట్లాడరు ? వెళ్లి వాళ్ల కాళ్లు పట్టుకుందామా? వెళ్లితే మీరు వెళ్లండి, నాకా అవసరం లేదు"

"అంటే మనం ఈ ఇల్లు ఖాళీ చేయవద్దా?"

"వద్దు ! ఎందుకు ఖాళీ చెయ్యాలి? మన డబ్బు మన ముఖాన పారేయమనండి, అప్పుడా డబ్బు పెట్టి మరో ఎపార్టుమెంటు కొనుక్కుని వెళదాం" అంటూ రవికి కొంత ఆలోచనకు టైమిచ్చి తర్వాత సమాధానం కోసం చూసింది.

రవి కొంత అయిష్టంగానే అయినా, దురభిమానం అడ్డువచ్చి " ఔనౌను, అలాగే చేద్దాం! వీడెవడు, మన తప్పలు ఎంచడానికి? ఈసారి ఫోను చేస్తే ఖచ్చితంగా అలానే చెప్పెయ్యాలి.. ఏం జరుగుతుందో చూద్దాం!" అన్నాడు.

ఏది జరుగుతుందో రవికి తెలుసును, ఇందిరకు తెలియకపోయినా! చట్టపరంగా ఈ ఇంటి మీద తనకే రకమైన హక్కు లేదు. ఖాళీ చెయ్యకపోతే ఓనరు ఊరుకుంటాడా? కాని ఆసంగతి ఇందిరకు చెప్పినా అర్థం కాదు.

వంశీ ఇచ్చిన గడుపు వారంలోకి పడింది. ఇందిరతో చర్చించి ఇల్లు ఖాళీ చేయకూడదనే నిర్ణయానికి వచ్చేడు రవి.

అనుకున్న ఆమర్నాడే వంశీ ఫోను చేశాడు. "నాన్నగారూ, ఇల్లు చూసుకున్నారా?"

"అదేంట్రా.. పెద్దవాళ్ళం.. ఉన్నపళంగా ఎక్కడికి వెళ్ళిపోతాం..!?"

"అదేంటి నాన్నాగారూ, నేనిదివరకే చెప్పానుగా, మీరు ప్రయత్నించాలే కాని మీకు ఇల్లు దొరకడం సమస్యకాదు"

"అయినా మేమెందుకు ఖాళీ చెయ్యాలో చెప్పు"

"అంతా విని మరల మొదటి కొచ్చారేమిటి? మా మామగారికిల్లు లేదు. వాళ్లని ఈ నెలాఖరుకి వాళ్లుంటున్న ఇట్లు ఖాళీ చేయమని వాళ్లవోనర్సు చెప్పారట. అందువలన వాళ్లని రమ్మని మీ కోడలు చెప్పిందట. మీరు ఖాళీ చెయ్యకుండా వాళ్ళెలా వస్తారు?"

ఈ సంభాషణ జరుగుతున్నపుడు ఇందిర కూడ రవి ప్రక్కనే ఉన్నది. ఫోన్ని బయటకు వినిపించేలా చేశాడు రవి, అందుచేత వంశీ మాటలు ఇందిర వింటున్నది. ఈ స్టేజిలో ఇందిర రవిచేతిలోంచి ఫోన్ అందుకుని.

"'ఒరే వంశీ, ఇల్లు ఖాళీ చేసి మమ్మల్నెక్కడికి పొమ్మంటావ్?"

"అద్దె ఇంటికి."

"ఆపని మీ మామగారే చేయవచ్చుగా?"

"కాని అమ్మా మా అబ్బాయిని చూడటానికి మా ఆవిడకి సహాయం కావాలిగా, అందువలన మా అత్తగారు తోడుగా ఉంటుందని..."

"మీ అబ్బాయిని మేం చూడలేమా? మేం మిమ్మల్ని పెంచలేదా?"

"నువ్వు చూడగలవు, పెంచగలవు, కాని నీ సంగతి నా కన్న మా ఆవిడకే ఎక్కువ తెలుసు."

"ఏంట్రా ఆ తెలిసింది? వివరంగా చెప్పు"

"అమ్మా వివరాల్లోకి వెళ్లవద్దు. అవన్నీ నేను నీకు చెబితే నువ్వు బాధపడతావు. నువ్వు బాధపడటం నా కిష్టం లేదు?"

"ఆహా తల్లితండ్రుల మీద ఎంత ప్రేమ? అత్తమామల కోసం తల్లిదండ్రులను బయటకు పొమ్మంటున్న నువ్వు తన తల్లిదండ్రుల కోసం అత్తమామల్ని బయటకు పంపాలనుకుంటున్న మీ ఆవిడ ఆహాహా!"

"వద్దమ్మా నీ ఎత్తిపొడుపులు! నువ్వు నీ అత్తమామల్ని మరుదుల్ని ఆడపచునీ ఎంత బాగా దగ్గరకు తీసుకున్నావో. ఎంత బాగా సంబంధ బాంధవ్యాలు, రాకపోకలు చేశావో నాకు తెలుసును. ఇక ఈ చర్చ మాని ఇల్లు ఖాళీ చేసే పనిలో ఉండమని నాన్నగారికి చెప్పు."

ఇందిర ఇంకేమీ మాట్లాడలేకపోయింది. అయినా దురభిమానం అడ్డువచ్చింది.

తీవ్ర స్వరంతో సమాధానం చెప్పింది

"అల్లాగే చేస్తాం, మాకివ్వాలిసిన 80లక్షలూ ఇచ్చెయ్. వేరే ఎపార్టుమెంటు కొనుక్కుని నీ యింటిలోంచి వెళ్ళి పోతాం."

"నీతో మాటలు అనవసరం, అమ్మా! ఫోను పెట్టేస్తున్నాను".

ఇందిరకు గొప్ప సంతోషం వేసింది. వీడిరోగం కుదిరింది అనుకుని సంబరపడింది. భర్త వైపు తిరిగింది.

కాని రవి ఆందోళన స్పష్టంగా కన్పించింది. "ఎందుకండీ బాధపడ్డారు? వాడి నోరుమూయించానుగా. ఏం చేస్తాడో చూద్దాం......"

రవికి తెలుసు వాడేం చెయ్యబోయేది అయినా చెబితే ఇందిరకు అర్థం కాదు. సమయం వచ్చినపుడు తనే తెలుసుకుంటుందిలే అనుకుని మౌనం దాల్చేడు. గతం కళ్లముందు నిల్చింది. కళ్లు మూసుకున్నాడు. సరిగ్గా తన రిటైర్మెంటుకు సంవత్సరం ముందు. అంతకు ముందే వంశీ కొత్త ఇల్లు కొనుక్కున్నాడు. గృహ ప్రవేశమూ అయింది. తన చిన్న ఎపార్టుమెంటు అమ్మి, వాడికి 20 లక్షలిచ్చి మిగిలిన పది లక్షలూ నేషనల్ సేవింగ్స్ డిపాజిట్స్లో సర్టిఫికెట్లు తీసుకున్నాడు. తనూ కొత్త ఇంట్లోకి మారాడు. ఇప్పుడున్న చిన్న పోర్షన్లోకి. వంశీ పెద్దభాగంలో ఉన్నాడు, భార్యతో సహా!

★★★★

ఒక రోజు రవి బ్యాంకుకు వెళ్లి తన సీట్లో కూర్చుని ఆఫీసు పనిని సమన్వయిం చేస్తూ బిజీగా ఉన్నాడు. తన ఛాంబర్ తలుపులు తీసుకుని నలుగురు ఆగంతకులు లోపలికి వచ్చేరు.

"ఎవరు మీరు? నా పర్మిషన్ లేకుండా లోపలికెందుకు వచ్చారు?"

"ముందుగా మీ పర్మిషన్ తీసుకుని లోపలికి వచ్చే పని కాదు మాది. సర్ప్రైజింగ్గా రావడమే, మామోడస్ ఆపరెండి!"

"అంటే..!?"

ఆ నలుగురిలో ఒకడు, బహుశా వాళ్ల లీడర్ అనుకుంటా, తన ఐడెంటిటీ కార్డు చూపిస్తూ" మేం విజిలెన్స్ స్క్వాడ్ వాళ్లం. మీమీద కంప్లెయింట్స్ వచ్చాయ్. మిమ్మల్ని చెక్ చెయ్యాలి" అంటూ ఎదురుగా కుర్చీలో కూర్చున్నారు. మిగిలిన వాళ్ళూ కూర్చున్నారు.

తనకు ముందు అర్థం కాలేదు. విజిలెన్స్ అయిడెంటిటీ కార్డు చూశాక, వీళ్లు ఆఫీసులో ఎవరినో చెక్ చెయ్యడానికి వచ్చి మేనేజర్గా తన పర్మిషన్ కోసం వచ్చేరనుకున్నాడు. కాని తననే చెక్ చెయ్యాలనడంతో తనకు మతిపోయింది. కళ్లు బైర్లు కమ్మాయి. ముప్పై ఆరేళ్ళ తన ఉద్యోగజీవితంలో ఎప్పుడూ ఇటువంటి పరిస్తితి రాలేదు. ఎక్కడో పొరబాటు జరిగి ఉంటుంది. అమాటే పైకి అన్నాడు.

"ఎక్కడో పొరపాటు జరిగింది. మీరెవరినో అనుకుని నా దగ్గరకు వచ్చారేమో."

"నో ప్లీజ్.. రవిగారూ ! అయామ్ వినయ్కుమార్, ఇన్స్పెక్టర్ ఆఫ్ దిస్ స్క్వాడ్.. మిమ్మల్ని చెక్ చెయ్యడానికి వారెంట్ ఇదిగో చూడండి." అంటూ ఒక కాగితం రవి చేతికిచ్చారు. రవి కుర్చీలో కూర్చుని అంతా చదివాడు. వాళ్ల పొరపాటు లేదు. తన మీద కంప్లెంట్, చెక్ చెయ్యడానికిచ్చిన వారెంట్ తన పేరూ, డిజిగ్నేషన్, ప్రస్తుతం ఉన్న ఆఫీస్ ఎడ్రస్ – అన్నీ కరెక్టుగా ఉన్నాయ్.

వినయ్ లేచాడు, వాడు తెలుగు వాడిలానే ఉన్నాడు.

"ఇదిగో రవిగారూ, మీ అటెండర్ని, పి.ఎ.ని పిలవండి. వాళ్లతో బ్యాంకులోకి ఎవరూ బయట వారిని రానివ్వద్దని, లోపల వాళ్లు ఎవర్నీ బయటకు పోవద్దని చెప్పండి. కూడా మావాళ్లని ఇద్దర్ని పంపుతాను. ఎవరూ ఫోన్లు చెయ్యకూడదు కూడా"

రవి తన పి.ఎ. భుజంగరావుని, ప్యూన్నీ లోపలికి పిలిచాడు. వినయ్ చెప్పమన్నట్లు చెప్పి " మీ కూడా ఈ ఇద్దరూ వస్తారు, గేటు దగ్గరొకరు, డోర్ దగ్గరొకరూ ఉంటారు. వాళ్లకి సహకరించండి"

వాళ్లు వెళ్లారు.

"దట్స్ రైట్, రవిగారూ, కేవలం మాకొచ్చిన ఆర్థరు ప్రకారం మే మొచ్చాం. మరోలా అనుకోకండీ.." వాతావరణాన్ని నార్మలైజ్ చేసే ప్రయత్నంలో వినయ్, "కూర్చోండి సార్" అంటూ తన ఫైలు బయటకు తీశాడు. అతనెంత సర్దడానికి ప్రయత్నించినా, తనమీద తనకెంత ఆత్మవిశ్వాసమున్నా రవి కంగారు ఆగలేదు. కూర్చున్నాడు.

"మీ మీద మోపబడిన అభియోగాలు, వాటి నిజానిజాలు మాకు ముఖ్యం కాదు. మమల్ని చెక్ చెయ్యమన్నవి చెక్ చేసి మాకు లభించిన సాక్ష్యాధారాలు మా కమీషనర్కి సబ్ మిట్ చెయ్యడం వరకే మాపని. మీ మీద మోపబడిన అభియోగాలు బ్రీఫ్గా : 1. మీరు లంచాలు తీసుకుని పరిశ్రమలకు, బిజినెస్ వాళ్లకు లోన్లు ఇస్తారని, 2. ఈ లంచాల సొమ్ముతోనే మీరొక పెద్ద ఇల్లు, మంచి బిజీప్లేస్లో కొని ఎవరికీ అనుమానం రాకుండా మీ అబ్బాయి వంశీ పేర పెట్టారని. 8. ఇంకా యన్.యస్.సి.లలోను, షేర్స్లోను కూడ పెట్టుబడులు పెట్టారని, బంగారం కొన్నారని మొదలయినవి, ఈ పై కారణాల వలన మేమిప్పుడు, మీ 1. డ్రాయర్ సొరుగులు, 2. మీ ఛాంబర్లో ఉన్నకప్ బోర్డు, 8. మీ బ్యాంక్ లాకర్ – చెక్ చేస్తాం. ఇంకా ఏమైనా డాక్యుమెంట్లు దొరికితే అవి కూడ చెక్ చెయ్యాలి."

వినయ్ చెప్పిన వివరాల ప్రకారం, ఈ అభియోగాలన్నీ అబద్ధాలనీ, తానులంచాలకి అతీతుడనని తనకి తెలుసు. కాని వీళ్లెందుకు వచ్చారు మరి? వీళ్ల దగ్గర కొన్ని ఋజువులుండకపోతే ఎందుకొస్తారు? రవికి ముచ్చెమటలు పోస్తున్నాయ్, వాళ్ల మాటలు వింటుంటే.

"వినయ్ గారూ, నేను చాల నిజాయితీపరుడిని, నా 36 ఏళ్ల సర్వీసులో నా మీద ఎటువంటి మచ్చ లేదు. నా మీద ఎవరో తప్పుడు కంప్లెయిట్స్ ఇచ్చి ఉంటారు."

“మీ మాట మేం నమ్మినా, చెక్ చెయ్యడం తప్పదుగా రవిగారూ! చెక్ చేశాక ఫలితాల్ని బట్టి చూద్దాం." వినయ్కుమార్ పని ప్రారంభించాడు. తన ప్రక్కగా ఉన్న అతనితో “గోపాల్, సార్ఛాంబర్కి లోపల బోల్టు బిగించు" రవి వంక తిరగి “సార్, మీరు మీ డ్రాయర్ సొరుగు తాళాలు, కప్ బోర్డు తాళాలు నా కిచ్చి మీ సీట్ నుండి ఇవతలకు రండి",

“ నా కప్ బోర్డ్ తాళాలు, లాకర్ తాళాలు డ్రాయర్ సొరుగులోనే ఉన్నాయి”

అంటూ డ్రాయర్ తీసి తాళాలు ఇచ్చేడు.

లాకర్ తాళాలకున్న టాగ్లో లాకర్ నెంబరు, రవి పేరు ఉన్నది. అంటే మిగిలినవి కప్ బోర్డ్ తాళాలు అన్నమాట! రవి తాళాలు ఇచ్చి వినయ్ ప్రక్కకు వచ్చి కూర్చున్నాడు.

“గోపాల్, సార్ డ్రాయర్ సొరుగులలోని సామానంతా జాగ్రత్తగా తెచ్చి ఈ టేబుల్ మీద పెట్టు”

గోపాల్ కదిలాడు. డ్రాయర్ సొరుగుల్లో ఒక నేప్కిన్, రవి పెర్సనల్ ఫైలూ, మరికొన్ని బ్యాంకు డాక్యుమెంట్లు ఉన్నయ్. రవి ఫైలు తీసుకుని మిగిలిన సామానంతా మరల యథాస్థానంలో పెట్టించాడు. కప్బోర్డు తాళాలు విడదీసి గోపాల్ కిచ్చి ‘కప్బోర్డు ఓపెన్ చెయ్యి ఏ అరలో వస్తువులు తీసి టేబుల్ మీద వరసగా పేర్చు"

రవిని తన దగ్గరే కూర్చోబెట్టుకున్నాడు. గోపాల్ కప్బోర్డు ఓపెన్ చేశాడు.

“క్రింద అరతో మొదలు పెట్టు, గోపాల్"

క్రింద అరలోని ఫైళ్లన్నీ తీసి టేబిల్ మీద పెట్టాడు.

“ఇవన్నీ ఏం ఫైల్సు సార్?”

“అవన్నీ మా ఆఫీసు స్టాఫ్ పెర్సనల్ ఫైళ్లు, వాళ్లబయోడేటాలు, బ్యాంకుకూ వాళ్లకూ మధ్య జరిగిన కరెస్పాండెన్సు, వాళ్ల కాన్ఫిడెన్షియల్ రిపోర్టులు మొదలైనవి ఉంటాయ్”

"రవి గారూ, ఈ కప్బోర్డు ఎవరు ఆపరేట్ చేస్తారు?”

“ నేనూ, నా ఎదురుగా నా పి.ఎ. భుజంగరావు మాత్రమే ఆపరేట్ చేస్తాము, భుజంగరావు కప్బోర్డు తాళాలు కప్బోర్డుతో పనయ్యాక తిరిగి నాకిచ్చేస్తాడు నేను వాటిని నా డ్రాయర్ మొదటి సొరుగులో పెడతాను.”

"మీ డ్రాయర్ తాళాలు మీ దగ్గరే ఉంటాయా?”

“అవును ఉంటాయ్, అలాగే ఛాంబర్ తాళాలు, మాత్రం నా పి.ఎ. ఆఫీసుకు ముందుగా వచ్చి నా దగ్గర చాంబరు తాళాలు, నా డ్రాయర్ తాళాలు తీసుకుని టేబుల్ ఛాంబర్ క్లిన్ చేయిస్తాడు."

"అయితే డ్రాయర్లో కప్ బోర్డు తాళాలు కూడ ఉంటాయి కదా! అంటే మీరు లేనప్పుడూ కప్బోర్డు ఆపరేట్ చెయ్యడానికి ఆస్కారముందిగా? “లేదు, నేను లేనపుడు అతను కప్బోర్డు ఆపరేట్ చెయ్యడు."

“ఓహో అలాగా...” సాలోచనగా వినయ్.

ఈలోగా పెర్సనల్ ఫైల్స్ అన్నీ ఒకటొకటి పరీక్షించడం మొదలు పెట్టారు.

వినయ్. అందులో భుజంగరావు ఫైల్ ముందు తీసి తన దగ్గర పెట్టుకున్నాడు.

గోపాల్ రెండవ అరలోని ఫైళ్లు టేబిల్ మీద విడిగా పెట్టాడు. అవి బ్యాంక్ హెడ్డాఫీసుతోనూ, ఇతర రీజినల్ ఆఫీసులోను కరెస్పాండెన్స్ మొదలయినవి. ఇక 8వ అనగా పై అర అందులో బ్యాంకు సంబంధించిన కొన్ని డాక్యుమెంట్సు ఉన్నాయి. వాటితో పాటు ఒక తెల్లటి కవరు, సీల్ చేసింది, తీసి టేబుల్ మీద పెట్టాడు. వినయ్ దాని వంక అనుమానంగా చూసి తన దగ్గర పెట్టుకున్నాడు.

“రవిగారూ, ఈ కవరులో ఏమున్నాయ్?"

ఆ కవరుని రవి అంతకు ముందు చూసినట్లు లేదు.

“అరె, ఈ కవరుని ఇప్పడే నేను చూడ్డం. ఇలా గివ్వండి చూద్దాం."

"అదేంటి మీకు తెలియకుండా ఈ కవరు కప్బోర్డు లోకి ఎలా వచ్చింది?"

రవి దగ్గర సమాధానం లేదు. కొంచెం కంగారూ కనపడింది.

"నా పి.ఎ.ని పిలిపించండి లోపలికి"

"గోపాల్.. సార్ పి.ఎ. భుజంగరావుని పిలు."

భుజంగరావు లోపలికి వచ్చేడు.

వినయ్ అన్నాడు "భుజంగరావుగారూ, ఇలా వచ్చి నా దగ్గర కూర్చోండి. చూడండి, ఈ కవరు కప్బోర్డు పై అరలో ఉంది. ఇందులో ఏమున్నాయి? మీ సార్ కి తెలియదంటున్నారు గనుక, ఇక మీకే తెలియాలి, ఈ కప్బోర్డు అపరేట్ చేసేది, మీరూ సారే మరి!?"

భుజంగరావు ఆ కవరు వంక అనుమానంగా చూసి

"నాకు తెలియదు సార్?" అన్నాడు.

"చివరిసారిగా ఈ కప్బోర్డు మీ రెప్పుడు ఆపరేట్ చేసారు?"

" నిన్న సాయంకాలం సార్ ఎదురుగా ఓపెన్ చేశాను."

"అప్పుడే ఛాంబర్లో మీరు గాక ఈ సార్ మాత్రమే ఉన్నారా? ఇంకెవయినా ఉన్నారా?"

"మేమిద్దరంగాక మరొక ఇండస్ట్రియలిస్టు వచ్చారు. ఆయనా ఇక్కడే ఉన్నారు."

"ఆయన మీరిక్కడే ఉండగా వెళ్లిపోయారా?"

"లేదు సార్! నేను కప్బోర్డుతో పనయ్యాక, క్లోజ్ చేసి పనుందని చెప్పి సార్ పర్మిషన్ తీసుకుని వెళ్లిపోయాను. ఆ సమయంలో ఆ ఇండస్ట్రియలిస్ట్, సారే ఛాంబర్లో ఉన్నారు",

వినయ్ రవి వైపు తిరిగి "రవి గారూ, ఈ కవర్ అక్కడికి ఎలా వచ్చిందో మీకు, మీ పి.ఎ.కి కూడా తెలియదంటున్నారు. అసలు ఈ కవరులో ఏముందో చూద్దాం." నెమ్మదిగా కత్తెరతో సన్నంగా కత్తిరించి లోపలికి చూశాడు.

★★★

*( కొనసాగింపు వచ్చేనెలలో)*

Post your comments